క్లుప్తంగా

గర్భిణులకు స్కానింగ్ పరీక్షలు



స్కానింగ్ పరీక్షల కోసం వేచిఉన్న గర్భిణులు

ఎమ్మిగనూరురూరల్: ప్రధానమంత్రి మాతృత్వ సురక్ష కార్యక్రమంలో భాగంగా సోమవారం స్థానిక ప్రభుత్వాసుపత్రికి పెద్ద సంఖ్యలో గర్భిణులు వచ్చారు. ఎమ్మిగనూరు, మంత్రాలయం, నందవరం, పెద్దకడుబూరు, కోసిగి మండలాల నుంచి స్కానింగ్ పరీక్షల పెద్ద సంఖ్యలో గర్భిణులు ఉదయమే ప్రభుత్వాసుపత్రికి చేరుకున్నారు. 348 మంది గర్భిణులకు స్కానింగ్ పరీక్షలు చేసినట్లు సూపరింటెండెంట్ డాక్టర్ మైత్రేయి తెలిపారు. స్కానింగ్ పరీక్షల కోసం వచ్చిన వారికి ఇబ్బంది కలగకుండా కుర్చీలు కూడా ఏర్పాటు చేశామని, పేర్లు నమోదు చేసుకున్న ప్రతి గర్భిణికి స్కానింగ్ పరీక్షలు చేసి పంపుతున్నట్లు చెప్పారు. డాక్టరు మైత్రేయి, డాక్టర్ ఫాతిమా వైద్య సేవలందించారు.

ఉత్తమ పనితీరుకు సన్మానం

మద్దికెర : మండలంలోని అధికారులు ఉత్తమ పనితీరు కనబరిచి సేవలందించడం అభినందించదగ్గ విషయమని ఎంపీపీ అనిత, ఎంపీడీఓ నరసింహమూర్తి, తహసీల్దార్ నాగభూషణం అన్నారు. ఈనెల 3 నుంచి 9వ తేదీ వరకు సంకల్ప సప్తహా కార్యక్రమంలో భాగంగా ఉత్తమ పనితీరు కనబరిచిన అధికారులను సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సన్మానించారు. సర్పంచ్ సుహాసిని, ఈఓఆర్డీ మద్దిలేటి స్వామి, ఏఓ రవి, సీడీపీఓ సావిత్రిదేవి, సూపర్‌వైజర్ సౌభాగ్యలక్ష్మిలు పాల్గొన్నారు.

ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈగా రామనీల



హొళగుంద: మండల ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈగా రామనీల సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇంతకుముందు ఇక్కడ ఏఈగా పనిచేసిన మనోహర్ కొన్ని నెలల క్రితం చిప్పగిరి మండలానికి బదిలీ అయ్యారు. అక్కడ ఏఈగా పని చేస్తున్న రామనీలను ఉన్నతాధికారులు హొళగుందకు నియమించారు. సోమవారం ఆయన హొళగుందలో బాధ్యతలు చేపట్టారు. ఆయన మాట్లాడుతూ మండలంలో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో ముందుకెళ్తానని తెలిపారు.

నేడు శిక్షణ కార్యక్రమం

కృష్ణగిరి: స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో మంగళవారం పంచాయతీ కార్యదర్శులకు ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు ఎంపీడీఓ విశ్వమోహన్ సోమవారం తెలిపారు. గ్రామ పంచాయతీల అభివృద్ధిపై ప్రొజెక్టర్ ద్వారా కార్యదర్శులకు వివరిస్తారని చెప్పారు. పంచాయతీ కార్యదర్శులందరూ తప్పక హాజరు కావాలని కోరారు.

శ్మశాన వాటికలకు స్థలం చూపాలి

తుగ్గలి: ఎస్సీ, ఎస్టీ కాలనీవాసులకు శ్మశాన వాటిక కోసం స్థలం చూపాలని కులవివక్ష పోరాట సమితి నాయకులు సోమవారం తహసీల్దార్ రవికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కేవీపీఎస్ జిల్లా సహాయ కార్యదర్శి రమేష్ మాట్లాడుతూ.. శ్మశానవాటికలు లేకపోవడంతో చాలా గ్రామాల్లో ఎస్సీ, ఎస్టీలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. అధికారులు వెంటనే శ్మశాన వాటికలకు స్థలాలు చూపాలని కోరారు. వ్యవసాయ కార్మిక సంఘం, సీఐటీయూ మండల కార్యదర్శులు శ్రీరాములు, రంగస్వామి పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

వెల్దుర్తి: తెలంగాణ రాష్ట్రం శాంతినగర్‌కు చెందిన జగదీష్ (33) సోమవారం పట్టణంలోని తిక్కతాత గుడి వద్ద పురుగు మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించాడు. లారీ డ్రైవర్‌గా జీవనం సాగించే జగదీష్ భార్య ఊరు వెల్దుర్తి కాగా మద్యం అలవాటుతో భార్యతో గొడవ పడుతూ వచ్చాడు. తన ఆత్మహత్యకు కుటుంబ సభ్యులే కారణమంటూ సెల్‌ఫోన్‌లో వీడియో తీసుకుని పురుగు మందు తాగాడు. ఘటనా స్థలంలో పడి ఉన్న జగదీష్‌ను గుర్తించిన స్థానికులు 108 అంబులెన్స్ ద్వారా కర్నూలు ఆసుపత్రికి తరలించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

ఆస్పరి: మండలంలోని నగరూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థులు త్రోబాల్ పోటీల్లో ప్రతిభ కనబరచి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు పీఈటీ విష్ణువర్ధన్ రెడ్డి సోమవారం తెలిపారు. ఈనెల 7వ తేదీన నంద్యాలలో జరిగిన అండర్-17 త్రోబాల్ జిల్లాస్థాయి పోటీల్లో పదో తరగతి విద్యార్థులు వరుణ్‌తేజ, మేఘన, అండర్ -14లో 9 వ తరగతి చదువుచున్న అఖిల, 8వ తరగతి చదువుచున్న మనోజ్ ప్రతిభ చూపడంతో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. వీరందరూ ఈ నెలాఖరులో నంద్యాలలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు హాజరవుతారన్నారు. ఈ సందర్భంగా క్రీడాకారులను హెచ్‌ఎం రవికుమార్, పీఎంసీ చైర్మన్ రామాంజినేయులు, ఉపాధ్యాయులు అభినందించారు.

ఆలూరు: అరికెర బాలయోగి గురుకుల కళాశాలకు చెందిన విద్యార్థులు రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ టి.శ్రీనివాస రెడ్డి సోమవారం తెలిపారు. కళాశాలలో ఇంటర్మీడియట్ చదువుతున్న కె.ప్రవీణ్‌కుమార్, ఎం.సతీష్, టి.వెంకటేశ్వర్లు, హెచ్.ఉదయ్, బి.రాజ్, బి.లోకేష్ వివిధ క్రీడాంశాల్లో రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు వివరించారు. క్రీడాకారులను ప్రత్యేకంగా అభినందించారు.

జగనన్న సురక్షతో అందరికీ ఆరోగ్యం



చెన్నాపురం వైద్య శిబిరంలో మందులు పంపిణీ చేస్తున్న దృశ్యం

తుగ్గలి: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజలందరికీ మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయని వైస్ ఎంపీపీ మల్లికార్జునరెడ్డి అన్నారు. సోమవారం ఎద్దులదొడ్డి గ్రామంలో సురక్ష వైద్య శిబిరాన్ని ప్రారంభించి ఆరోగ్య పరీక్షలు చేయించుకున్నారు. పేదలందరికీ స్థానికంగానే నాణ్యమైన వైద్యం అందించడమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం సురక్ష వైద్య శిబిరాలు నిర్వహిస్తోందన్నారు. వైద్య పరీక్షలు చేయించుకున్న వారికి కేస్ షీట్లను అందజేయడంతో పాటు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ప్రజలందరూ వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

పేదలకు మెరుగైన వైద్యం అందిస్తున్న ప్రభుత్వం

వెల్దుర్తి: ఎన్నో ఆరోగ్య పథకాల ద్వారా పేదలకు, గ్రామీణ ప్రాంతాల వారికి ఉచితంగా మెరుగైన వైద్య సేవలు అందిస్తున్న ప్రభుత్వం తమదని సూదేపల్లె వైఎస్సార్‌సీపీ నాయకుడు వెంకటేశ్వర రెడ్డి అన్నారు. సోమవారం ఆ గ్రామంలో ఎంపీడీఓ శ్రీనివాసరావ్, సర్పంచ్ బాలకృష్ణ, గోవర్ధనగిరి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష హెల్త్ క్యాంప్ నిర్వహించారు. గోవర్ధనగిరి, రామళ్లకోట పీహెచ్‌సీల వైద్యాధికారులు డాక్టర్ శ్రీధర్‌రెడ్డి, భువన తేజ, కర్నూలు స్పెషలిస్టు వైద్యులు డాక్టర్ పవన్, అన్నపూర్ణ, కవిత వైద్య సేవలందించగా సూదేపల్లె, మదార్‌పురం గ్రామాలకు చెందిన 409 మంది పరీక్షలు చేయించుకున్నారు. అతిథులు, అధికారులు, ప్రజాప్రతినిధులు పలువురికి కంటి అద్దాలు, ఆరోగ్యశ్రీ హెల్త్ కార్డులు అందించారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పౌష్టికాహార స్టాల్ ఏర్పాటు చేసి ప్రజలకు అవగాహన కల్పించారు. సెక్రటరీ ఉమ, ఎమ్‌పీహెచ్‌ఏ నాగన్న, ఎంపీహెచ్‌ఎస్ నాగలక్ష్మి, సీహెచ్‌ఓ భాగ్యలక్ష్మి, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు తమ వంతు సేవలందించారు.

చెన్నాపురంలో వైద్య శిబిరం

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని చెన్నాపురం గ్రామంలో సోమవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు.. ఈ సందర్భంగా ఎంపీడీఓ బంగారమ్మ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరికీ మెరుగైన వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నామని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వైద్య సిబ్బంది ప్రతి ఇంటికీ వెళ్లి కుటుంబసభ్యులకు ఆరోగ్య పరీక్షలు చేసి వైద్యం అవసరమైన వారిని శిబిరానికి రప్పించి వైద్య సేవలందించడంతో పాటు మందులు అందజేస్తున్నారని చెప్పారు. హెల్త్ క్యాంప్‌లో డాక్టర్ సాయికిరణ్, వైద్య సిబ్బంది, అన్నిశాఖల అధికారులు, అంగన్‌వాడీ టీచర్లు, సచివాలయ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

హొళగుంద: ప్రజారోగ్యానికి భద్రత కల్పిస్తూ గ్రామాల్లోనే మెరుగైన వైద్యం అందించేందుకు ప్రభుత్వం 'జగనన్న ఆరోగ్య సురక్ష ' కార్యక్రమాన్ని అమలు చేస్తోందని తహసీల్దార్ హుసేన్‌సాహేబ్, ఎంపీడీఓ సుహాసినమ్మ అన్నారు. సోమవారం ఎల్లార్తి గ్రామంలో సర్పంచ్ కురువ చాముండేశ్వరి ఆధ్వర్యంలో హొళగుంద, గజ్జహళ్లి పీహెచ్‌సీ వైద్యాధికారులు న్యూటన్, రాధ, కర్నూలు వైద్యులు కలాముద్దీన్, కంటి వైద్యులు చంద్రశేఖర్, డాక్టర్ మనోజ్ తదితరులు ప్రజలకు వైద్య సేవలందించారు. బీపీ, సుగర్, హెచ్‌బీ లాంటి సాధారణ పరీక్షలతో పాటు అన్ని రకాల జబ్బులున్న వారిని పరీక్షించి ఆరోగ్య జాగ్రత్తలు చెప్పి మందులు అందించారు. అలాగే ఐసీడీఎస్ ఆధ్వర్యంలో న్యూట్రిషన్ స్టాల్‌ను ఏర్పాటు చేశారు. గర్భిణులకు సీమంతం చేశారు. వైద్య శిబిరంలో 350 మందిని పరీక్షించగా అందులో 30 మందిని మెరుగైన వైద్యం కోసం రెఫర్ చేసినట్లు డాక్టర్ న్యూటన్ తెలిపారు.

ఆలూరు రూరల్: మండలంలోని కురుకుంద గ్రామ ఎంపీపీ స్కూల్‌లో ఏర్పాటు చేసిన హెల్త్ క్యాంపులో 503 మంది రోగులు వైద్య పరీక్షలు చేయించుకున్నారు. 22 మందికి కళ్లద్దాలు పంపిణీ చేశారు. గత 15 రోజులు క్రితం వైద్యారోగ్య సిబ్బంది, సచివాలయల సిబ్బంది వలంటీర్లు ఇంటింటికి తిరిగి వారి ఆరోగ్య పరిస్థితులు తెలుసుకుని టోకేన్లు అందించారు. వాందరికీ బుధవారం వైద్యులు అన్ని ఆరోగ్య పరీక్షలు చేసి మందులు అందించారు. గ్రామ సర్పంచ్ దేవిరెడ్డి, వైద్యులు ఇబ్రహీం, వాహిద్, సుస్మిత ,లిఖిత తదితరులు వైద్య సేవలందించారు.

ప్రజారోగ్యంపై ఇంత శ్రద్ధ ఎప్పుడూ చూడలేదు



ఇంతకుముందు గ్రామాలలో విషజ్వరాలు, సీజనల్ వ్యాధులు ప్రబలి సీరియస్‌గా మారితే తప్పా వైద్య శిబిరాలు కనబడేవి కావు. చిన్న వ్యాధికి జేబులు గుల్ల అయ్యేవి. అలాంటిది ప్రజలు ఇబ్బందులు పడకూడదని ప్రభుత్వం గ్రామంలోనే ఉచితంగా ఆరోగ్య పరీక్షలు చేసి వైద్య సేవలందించడం అభినందనీయం. ఒక గ్రామానికి ఇంత మంది డాక్టర్లు, హెల్త్ సిబ్బంది, ఇతర అధికారులు సేవలు అందిస్తున్నారు. ప్రజల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడం ఆనందంగా ఉంది. ఆర్థిక స్థోమత లేని ఎంతో మందికి ఇలాంటి వైద్య శిబిరాలు ఉపయోగపడతాయి.

–విరుపాక్షయ్యస్వామి, ఎల్లార్తి



ఎద్దులదొడ్డిలో వైద్య పరీక్షలు చేయించుకుంటున్న వైస్ ఎంపీపీ మల్లికార్జున రెడ్డి







సూదేపల్లెలో కళ్లద్దాల పంపిణీ, ఎల్లార్తిలో వైద్య సేవలను పరిశీలిస్తున్న అధికారులు, కురుకుందలో వైద్య పరీక్షల కోసం రిజిస్ట్రేషన్ చేయించుకుంటున్న ప్రజలు

గ్రామాల్లో వేగంగా అభివృద్ధి పనులు



పందిర్లపల్లెలో ఎస్సీ కాలనీలో నిర్మించిన సీసీ రోడ్డు

కృష్ణగిరి: గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా గ్రామాల్లో అభివృద్ధి పనులు ముమ్మరంగా సాగుతున్నాయని పీఆర్ డీఈ శేషయ్య తెలిపారు. మండలంలోని లక్కసాగరం గ్రామ సచివాలయ పరిధిలోని పందిర్లపల్లె గ్రామ ఎస్సీ కాలనీలో రూ.10 లక్షలతో నిర్మించిన సీసీ రహదారిని ఆయన సోమవారం పరిశీలించారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ప్రతి సచివాలయ పరిధిలో రూ.20 లక్షల నిధులతో పలు అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. అలాగే మండలంలో గ్రామ సచివాలయాలు, ఆర్‌బీకేలు, వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లు కూడా 70 శాతానికిపైగా పూర్తయినట్లు వివరించారు. ఏఈ అబ్దుల్ వహీద్‌సాహెబ్, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు వెంట ఉన్నారు.

కరువు ప్రాంతంగా ప్రకటించాలి

దేవనకొండ: తీవ్ర వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో ఎండిన పంటలను పరిశీలించి దేవనకొండను కరువు ప్రాంతంగా ప్రకటించి రైతులను ఆదుకోవాలని సీపీఐ మండల ప్రధాన కార్యదర్శి ఎం.నరసారావు కోరారు. ఈ మేరకు సోమవారం రైతులు, కార్యకర్తలతో కలిసి తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన స్పందనలో తహసీల్దార్ వెంకటేష్‌నాయక్‌కు వినతి పత్రం అందజేశారు. సీపీఐ మండల కార్యదర్శి మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ ప్రారంభం నాటి నుంచి అరకొర వర్షాల వల్ల తీవ్ర వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో రైతులు సాగుచేసిన పంటలన్నీ ఎండిపోయాయన్నారు. వెంటనే అధికారులు పంట పొలాలను సందర్శించి నివేదికలను ప్రభుత్వానికి పంపాలన్నారు. సీపీఐ మండల నాయకులు సుల్తాన్, రామంజి, రామాంజనేయులు, తిమ్మప్ప, నరేష్, రైతులు తదితరులు ఉన్నారు.

11 నుంచి ఎల్లార్తి ఉరుసు



షేక్షావలి తాత సమాధి

హొళగుంద: మత సామరస్యానికి చిహ్నంగా వెలుగొందుతూ జిల్లాలో ప్రసిద్ధి చెందిన ఎల్లార్తి షేక్షావలి, షాషావలి తాతల దర్గా ఉరుసు ఈ నెల 11వ తేదీ నుంచి 13వ తేదీ వరకు ఘనంగా జరగనుంది. 11న గంధం (సందల్), 12న ఉరుసు, 13న జియారత్ కార్యక్రమాలతో ఉత్సవాలు ముగుస్తాయి. ఉరుసుకు రాష్ట్రం నుంచే గాక తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర నుంచి భక్తులు భారీ సంఖ్యలో తరలివస్తారు. మూడు రోజులపాటు జరిగే ఉత్సవాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఆలూరు సీఐ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించనున్నట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు.

చరిత్ర: షేక్షావలి, షాషావలి తాతలు అరబ్ దేశానికి చెందిన మత ప్రచారకులు. వారు పూర్వం భారత దేశంలో సంచరిస్తూ ప్రజలకు తోచిన సహాయం చేసేవారు. దేశంలో అనేక ప్రాంతాలు తిరిగిన వీరు రాయచూరులో కొద్ది రోజులు గడిపి చివరికి ఎల్లార్తిలో స్థిర నివాసం ఏర్పరుచుకొన్నారు. ఇక్కడి ప్రజలకు ఎన్నో సహాయ సహకారాలు అందించిన తాతలు మహిమలు కల్గి ఉన్నారని ప్రాచుర్యంలో ఉంది. చివరికి వారు ఇక్కడే మరణించడంతో వారి సమాధులను దర్శించుకోవడానికి భక్తుల తాకిడి మొదలై ఎల్లార్తి పెద్ద పుణ్యక్షేత్రంగా వెలుగొందింది. నిత్యం సమస్యలతో సతమతమవుతూ మానసిక రుగ్మతలతో ఇబ్బంది పడే వారు ఎల్లార్తి దర్గాలను దర్శించుకుంటే అన్నికష్టాలు తీరుతాయనే విశ్వాసం భక్తుల్లో ఉంది.

ఎల్లార్తికి ఇలా చేరుకోవచ్చు...

ఎల్లార్తి దర్గాలకు ఆంధ్రా, కర్ణాటక నుంచి రాకపోకలు సాగించవచ్చు. జిల్లా కేంద్రం కర్నూలు నుంచి ఆలూరు మీదుగా ఎల్లార్తికి 120 కి.మీ దూరం ప్రయాణించాలి. ఆదోని మీదుగా 130 కిమీ ఉంటుంది. హొళగుంద నుంచి 9 కి.మీ, ఆలూరు నుంచి 19 కి.మీ దూరంలో ఎల్లార్తి గ్రామం ఉంది. కర్నూలుతో పాటు అనంతపురం జిల్లాకు సంబంధించి గుంతకల్, గుత్తి, తదితర ప్రాంతాల వారు ఆలూరు మీదుగా ఎల్లార్తికి చేరుకోవచ్చు. కర్ణాటక రాష్ట్రం బళ్లారి, శిరుగుప్ప తదితర పట్టణాల వారు హొళగుంద మీదుగా చేరుకోవచ్చు. ఎల్లార్తికి ఆర్టీసీ బస్సు సౌకర్యలతో పాటు ప్రైవేటు వాహనాలు కూడా తిరుగుతాయి.

ఎల్లార్తిలో మరిన్ని దర్గాలు

ఎల్లార్తిలో షేక్షావలి, షాషావలి దర్గాలను దర్శించుకున్న భక్తులు ఈ దర్గాల పరిసరాల్లో ఉన్న జెండా కట్ట, దాదీమా, దూద్‌పీరా తాత దర్గాలను కూడా దర్శించుకుని మొక్కుబడులు చెల్లించుకుంటారు. దాదాపు 400 ఏళ్లనాటి చరిత్ర కలిగిన ఈ దర్గాలను పలు రాష్ట్రాల భక్తులు కొలుస్తారు. ఈ ఉరుసు వేడుకలన్నీ వక్ఫ్‌బోర్డు ఆధ్వర్యంలో జరుగుతాయి.

వేదావతి ప్రాజెక్టును పూర్తి చేయాలి



ర్యాలీ నిర్వహిస్తున్న సీఐటీయూ, రైతు సంఘం నాయకులు

హాలహర్వి: వేదావతి ప్రాజెక్టుకు నిధులు మంజూరు చేసి నిర్మాణ పనులు పూర్తి చేయాలని సీఐటీయూ జిల్లా నాయకులు గౌస్ దేశాయి, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పీఎస్ రాధాకృష్ణ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం గ్రామాల్లో ర్యాలీ చేపట్టారు. వారు మాట్లాడుతూ.. నిత్యం కరువుతో అల్లాడుతున్న ఆలూరు నియోజకవర్గ రైతులను ఆదుకునేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలన్నారు. వేదావతి ప్రాజెక్టు పూర్తయితే ఆలూరు నియోజకవర్గం సస్యశ్యామలం అవుతుందన్నారు. రైతులకు పుష్కలంగా సాగునీరు అందుతాయని చెప్పారు. ఈ దిశగా చర్యలు చేపట్టాలన్నారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కేపీ నారాయణస్వామి, రైతు సంఘం మండల కార్యదర్శి ఈరన్న, సీఐటీయూ నాయకులు షాకీర్, కృష్ణ, వెంకటేశ్వర్లు, డీవైఎఫ్ఐ నాయకులు గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

బియ్యం పంపిణీకి సాంకేతిక సమస్య

హాలహర్వి: మండలంలో ఈనెల మొదటి నుంచి సాంకేతిక సమస్య కారణంగా రేషన్ బియ్యం పంపిణీకి ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఎండీయూ ఆపరేటర్లు అన్నారు. ఈ మేరకు సోమవారం రేషన్ పంపిణీ చేసే వాహనాలన్నింటినీ తహసీల్దార్ కార్యాలయం ముందు ఉంచి నిరసన తెలియజేశారు. సాంకేతిక సమస్యకు పరిష్కారం చూపకుంటే లబ్ధిదారులకు రేషన్ సరుకులు అందించడం కష్టమవుతుందని వివరించారు. సమస్యను త్వరితగతిన పరిష్కరించాలని కోరారు. స్పందించిన తహసీల్దార్ ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారమయ్యేలా చూస్తానని హామీ ఇచ్చారు.

హొన్నూరు కొట్టాలలో తాగునీటి ఎద్దడి

హొళగుంద: మండల పరిధిలోని హొన్నూరు క్యాంపులో ప్రజలు గత వారం రోజులుగా తాగునీటి సమస్యతో అల్లాడుతున్నారు. గ్రామంలో ఉన్న బోరు చెడిపోవడంతో పాటు ఎల్లెల్సీ డిస్ట్రిబ్యూటరీ కాలువ నీరు రాకపోవడంతో క్యాంపువాసులు తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు వైఎస్సార్‌సీపీ నాయకులు పల్లి ఈరన్న, క్యాంపు వాసులు సోమవారం తెలిపారు. కిలో మీటర్ల దూరంలో ఉన్న పొలాల వద్దకు వెళ్లి బోరు బావుల నుంచి తాగు నీటిని తెచ్చుకోవాల్సిన దుస్థితి ఏర్పడిందని వాపోయారు. అధికారులు వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



వృద్ధురాలికి సంక్షేమ క్యాలెండర్ అందజేస్తున్న ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి

నందవరం: పేదల సంక్షేమమే ధ్యేయంగా సీఎం జగన్ మోహన్ రెడ్డి పాలన సాగిస్తున్నారని వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండలంలోని మిట్టసోమాపురం, నందవరం-1, నందవరం-2 సచివాలయాల పరిధిలో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం చేపట్టారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పనితీరు వివరిస్తూ, లబ్ధిపొందిన పథకాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వాల కంటే మెరుగ్గా ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యత ఇచ్చి సీఎం జగనన్న పాలన సాగిస్తున్నారని వివరించారు. విద్య, వైద్య, వ్యవసాయ రంగాలపై ఎంతో శ్రద్ధ తీసుకున్నారన్నారు. రైతులకు 9 గంటల ఉచిత విద్యుత్, రైతు భరోసా కేంద్రాల ఏర్పాటు, గిట్టుబాటు ధరలు కల్పించడంతో సంతోషంగా ఉన్నారని వివరించారు. జగనన్న పాలనను ప్రతిపక్ష పార్టీల నేతలు జీర్ణించుకోవడం లేదని ఆరోపించారు. అవినీతిలో చంద్రబాబును మించిన వారు ఎవ్వరూ లేరని విమర్శించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ శివారెడ్డి గౌడ్, జెడ్పీటీసీ సభ్యుడు నిఖిల్, సర్పంచ్‌లు తోట సావిత్రి, లక్ష్మీదేవి, ఎంపీడీఓ దశరథరామయ్య, ఈఓపీఆర్‌డీ ఈశ్వరయ్య, ఏపీఎం చిన్న ఈరన్న, ఎంఈఓ-2 రఘునాథ్, నాయకులు నరసింహా, మల్లికార్జున, బోయ శ్రీనివాసులు, రమేష్‌గౌడ్, దత్తాత్రేయగౌడ్, నాగరాజు పాల్గొన్నారు.

నాటుసారా స్థావరాలపై నిఘా

ఆలూరు: హొళగుంద మండలం దేవరగట్టులో వెలసిన మాళ మల్లేశ్వర స్వామి దసరా ఉత్సవాలలో భాగంగా నాటుసారా తయారీ, అక్రమ మద్యం తరలింపుపై నిఘా ఉంచినట్లు ఆలూరు సీఐ బి.వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. స్థానిక పోలీసు సర్కిల్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. ఉత్సవాలు ప్రశాంతంగా నిర్వహించుకునేలా పోలీసు శాఖ ఆధ్వర్యంలో తగిన బందోబస్తు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. నాటుసారా, అక్రమ మద్యం కట్టడికి సెబ్, సివిల్ పోలీసులతో కలిసి ఎప్పటికప్పుడు దాడులు నిర్వహించేలా ప్రణాళిక రూపొందించామన్నారు. సరిహద్దు ప్రాంతాల్లో 6 చోట్ల చెక్‌పోస్టులను ఏర్పాటు చేస్తున్నామన్నారు. అల్లర్లకు పాల్పడే వారిపై నిఘా ఉంచామని, శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

న్యాయవాదుల విధుల బహిష్కరణ



ఎమ్మిగనూరులో విధులను బహిష్కరించి నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

ఎమ్మిగనూరుటౌన్: కోర్టు కేసులను దాఖలు చేసే ప్రతి దరఖాస్తులో కోర్టు స్టాంప్ ఫీజుతో పాటు వెల్ఫేర్ ఫండ్ కింద అదనంగా రూ.20 స్టాంప్‌ను వేయాలన్న నిబంధనను నిరసిస్తూ సోమవారం స్థానిక జూనియర్ సివిల్ కోర్టులో బార్ అసోసియేషన్ అధ్వర్యంలో న్యాయవాదులు విధులను బహిష్కరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వెంకటేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ.. అదనపు స్టాంప్‌తో క్లయింట్లకు ఇబ్బందిగా మారుతుందని, అలాగే న్యాయవాదులకు కూడా ఇబ్బందని పేర్కొన్నారు. దీన్ని నిరసిస్తూ జిల్లా న్యాయవాదుల సంఘం పిలుపు మేరకు ఈనెల 13వ తేదీ వరకు విధులను బహిష్కరిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ నిబంధనను తొలగించాలని వారు కోరారు. న్యాయవాదులు లక్ష్మినారాయణ రెడ్డి, గురురాజారావు, దామోదర్‌రెడ్డి, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీ విత్తనాలు సద్వినియోగం చేసుకోండి

చిప్పగిరి: ప్రభుత్వం సబ్సిడీ ద్వారా అందించే పప్పుశనగ విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏఓ విజయలక్ష్మి సూచించారు. స్థానిక వ్యవసాయ కార్యలయంలో ఆమె మాట్లాడుతూ.. రైతులు సబ్సిడీ పోనూ క్వింటాలుకు రూ.4,860 చెల్లించి విత్తనాలు పొందవచ్చని తెలిపారు. పప్పుశనగ విత్తనం వేసేందుకు ఈ నెల 15వ తేదీ నుంచి అనుకూలమని చెప్పారు. విత్తనాలు తీసుకున్న వారు తప్పనిసరిగా అదే పంట సాగు చేయాలన్నారు.

నేడు బి.అగ్రహారంలో వైద్య శిబిరం

గోనెగండ్ల: మండల పరిధిలోని బి.అగ్రహారం గ్రామంలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. గ్రామ సచివాలయం ఏర్పాటు చేసే వైద్య శిబిరంలో స్పెషలిస్ట్ వైద్యులు అందుబాటులో ఉంటారని ప్రజలు వైద్య చికిత్సలు పొంది సద్వినియోగం చేసుకోవాలన్నారు.

రైతులను ఆదుకోవాలి

ఎమ్మిగనూరుటౌన్: ఖరీఫ్‌లో ఆశించిన మేర వర్షాలు కురవకపోవడంతో పంటలు ఎండిపోయాయని, ఎమ్మిగనూరును కరువు మండలంగా ప్రకటించి రైతులను ఆదుకోవాలని ఏఐకేఎంఎస్ డివిజన్ అధ్యక్షుడు సత్యన్న కోరారు. ఈ మేరకు సోమవారం స్థానిక రెవెన్యూ కార్యాలయం ముందు రైతులతో కలిసి ధర్నా చేపట్టి తహసీల్దార్ ఆంజనేయులుకు వినతి పత్రం అందించి మాట్లాడారు. వేలాది రూపాయల పెట్టుబడులు పెట్టి సాగు చేసిన పంటలు చేతికి రాకపోవడంతో రైతులు ఆర్థికంగా నష్టపోయారని వారిని ఆదుకునేందుకు కరువు సహాయక చర్యలు చేపట్టాలని కోరారు. పలు సంఘాల నాయకులు నాగరాజు, ఉరుకుంద, నాగేంద్ర, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు భోజన సదుపాయం

పత్తికొండ రూరల్: పత్తికొండ ప్రభుత్వాసుపత్రికి సోమవారం స్కానింగ్ పరీక్షల నిమిత్తం వచ్చిన గర్భిణులు, వారి వెంట వచ్చిన సహాయకులు 250 మందికి వైఎస్సార్‌సీపీ నాయకుడు పోచిమిరెడ్డి మురళీధర్ రెడ్డి భోజన సదుపాయం కల్పించారు. గైనకాలజిస్టు కల్పన భోజనం వడ్డించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎంపీటీసీ దేవరగట్టు లక్ష్మి, అనిత, నెనావత్ సరోజ, వార్డు మెంబర్లు, సేవాదళ్ సభ్యులు పాల్గొన్నారు.

స్పందన అర్జీలు పరిష్కరించండి

కృష్ణగిరి: స్పందన కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చే అర్జీల పట్ల సంబంధిత అధికారులు అప్రమత్తంగా ఉండి సత్వరమే పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ రాజేశ్వరి ఆదేశించారు. స్థానిక కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందనలో వివిధ గ్రామాల నుంచి వచ్చిన పలు అర్జీలను ఆమె స్వీకరించారు. అర్జీలను శాఖల వారీగా అందజేసి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. రెవెన్యూ సమస్యలపై వచ్చిన అర్జీల పట్ల వీఆర్వోలు క్షేత్రస్థాయిలో పరిశీలించి రెండు మూడు రోజుల్లో పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎంపీడీఓ విశ్వమోహన్, ఏఓ వెంకటేశ్వర్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

చిప్పగిరి: స్పందన కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దారు లక్ష్మినారాయణ మండల ప్రజలకు సూచించారు. సోమవారం స్పందన కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. వినతులు పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఎంపీడీఓ కొండయ్య, ఎంఈఓ విజయలక్ష్మి, ఏపీఎం నాగార్జున, ఈఓపీఆర్డి నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

గోనెగండ్లలో డెంగీ నిర్ధారణ

గోనెగండ్ల: స్థానిక మొట్టివీధిలో ఐదేళ్ల బాలికకు డెంగీ వ్యాధి సోకినట్లు మలేరియా సబ్ యూనిట్ అధికారి సాయిబాబా తెలిపారు. దీంతో సోమవారం వైద్య సిబ్బంది ఆ ప్రాంతానికి వెళ్లి బాలిక ఇంటి పరిసరాలలో శుభ్రం చేయించారు. దోమల నివారణ మందు పిచికారీ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అలాగే ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకుంటే వ్యాధులు దరిచేరవన్నారు. గ్రామంలో ఎవరికైనా డెంగీ లక్షణాలు ఉంటే స్థానిక వైద్యులను సంప్రదించి చికిత్స చేయించుకోవాలన్నారు. ఎంపీహెచ్‌ఈఓ హనుమంతు, ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్‌ఎం, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

బైక్‌లు ఢీకొని ఇద్దరికి తీవ్రగాయాలు





ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న విక్రాంత్, అశోక్

పత్తికొండ రూరల్: పత్తికొండ బైపాస్ రోడ్డులోని మలకలకుంట వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. విక్రాంత్ పొలం పనులకు వెళ్లి తిరిగి పొలం రస్తా నుంచి బైపాస్ రోడ్డుపైకి వస్తున్నాడు. అదే సమయంలో బేల్దారి అశోక్ బైపాస్ రోడ్డులో బైక్‌పై వేగంగా వస్తుండగా రెండు బైక్‌లు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు కాగా చికిత్స నిమిత్తం పత్తికొండ ప్రభుత్వాసుపత్రికి తరలించి ప్రాథమిక చికిత్సనందించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యుల సలహా మేరకు కర్నూలు ఆసుపత్రికి తీసుకెళ్లారు.

వృద్ధురాలి అదృశ్యం



నారాయణమ్మ (ఫైల్)

వెల్దుర్తి: స్థానిక రాణితోటకు చెందిన నారాయణమ్మ (65) ఆదివారం సాయంత్రం నుంచి అదృశ్యమైనట్లు ఆమె కుమారుడు అశోక్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఇంట్లో జరిగిన చిన్న గొడవ వల్ల ఇంటి నుంచి వెళ్లిపోయినట్లు అందులో పేర్కొన్నాడు. పలు చోట్ల వెతికినా ఆచూకీ తెలియకపోవడంతో సోమవారం పోలీసులను ఆశ్రయించినట్లు తెలిపాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించినట్లు ఎస్ఐ చంద్రశేఖర్ రెడ్డి వెల్లడించారు. ఎక్కడైనా ఆమెను గుర్తించిన వారు 91211 01118, లేదా 100కు కాల్‌చేసి సమాచారం తెలపాలని కోరారు.